క్లుప్తంగా

25వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

సీతంపేట: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శనివారం ఉదయం బీటీఆర్ నగర్, రెల్లి వీధి ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, తాగునీరు, హౌసింగ్ సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్‌లో తెలియపర్చారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ అడ్మిన్ రాజశేఖర్, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధి 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ప్రధాన రహదారిలో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీకొట్లను శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు, షాపులు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్‌లో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో సుమారు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. ఈ పనులను శనివారం ఉదయం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాసనగర్, నందగిరినగర్ ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. వెంకటేశ్వర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని, వెంకటేశ్వర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సుమారు రూ.10 లక్షలతో ఆధునికీకరించామని, వార్డులోని ప్రజల చిరకాల సమస్య అయిన శ్రీనివాసనగర్ గెడ్డపై ఉన్న బ్రిడ్జి విస్తరణ పనులు రూ.33 లక్షలతో ప్రారంభించామని చెప్పారు. మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఉషశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గ్లోబల్ విద్యార్థులుగా ఎదగాలి

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆకాంక్ష
- 'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం, పురస్కారాల బహూకరణ

మురళీనగర్: మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదగాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆకాంక్షించారు. మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను పతకాలు, నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సృష్టించిన ప్రభంజనం జగనన్నకు ఇచ్చిన కానుకగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో వీరికి మరింత గుర్తింపు తెచ్చేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించడంతోపాటు పతకాలు, నగదు బహుతులు ఇస్తున్నామని చెప్పారు. చదువును ప్రోత్సహించేందుకు జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న విద్యా కానుక, విద్యా, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలు పేదల ఇళ్లల్లో విద్యా వెలుగులు ప్రసరింపజేస్తున్నాయన్నారు.

పతకాలు.. అభినందనలు

ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన బి.ధనలక్ష్మికి బంగారు పతకం, రూ.3 వేల నగదు.. రెండో స్థానంలో నిలిచిన వారికి రజత పతకం, రూ.2 వేల నగదు.. మూడో స్థానంలో నిలిచిన వారికి కాంస్య పతకం, వెయ్యి రూపాయల నగదు, ప్రసంశాపత్రాలను కె.కె.రాజు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, కె.అనిల్‌కుమార్ రాజు, కె.వి.ఎన్.శశికళ, కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, పార్టీ వార్డు అధ్యక్షుడు నీలి రవి, మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేషన్ల డైరెక్టర్లు పైడి శ్రీను, రాయుడు శ్రీను, ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్లు కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, కె.వెంగళరావు, బగాతి విజయ్‌కుమార్, రాజంరాజు, చిరంజీవి, భోగవల్లి గోవింద్, హరిపట్నాయక్, పైడి ప్రతాప్, ఎం.గోపి, జె.సత్యనారాయణ, వై.శ్రీనివాసరెడ్డి, పి.రామ్‌మోహన్, సోనీ, పి.అప్పారావు మాస్టర్, నాయుడు మాస్టర్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెన్త్‌లో ఉత్తర నియోజకవర్గ టాపర్ బి.ధనలక్ష్మి, విద్యార్థిని తల్లిని సత్కరిస్తున్న కె.కె.రాజు



మాధవధార హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో అతిథులు

పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ముఖ్య అతిథి స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం బోధన అందుబాటులోకి తెచ్చారన్నారు. సీబీఎస్ఈ విద్యా విధానం, పిల్లలకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ ఇచ్చారని తెలిపారు. రుచి గల పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా పిల్లలకు అందిస్తున్నారని చెప్పారు. పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే 9 రకాల వస్తువులతో కూడిన జేవీకే కిట్లు అందజేయడం చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ విద్యా రంగంపై చూపిస్తున్న శ్రద్ధ తెలుస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కార్పొరేటర్ గోవింద్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు శారద, అరుణ, ఎడ్యుకేషన్ సెక్రటరీ వినోద్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వార్డు నాయకులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత విశాఖకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: దేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ లైఫ్, విశాఖలో అమలు చేస్తున్న ఎకో వైజాగ్ కార్యక్రమాలను జయప్రదం చేద్దామని, పర్యావరణ హిత విశాఖకు పాటుపడదామని ఎస్ఎంసీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుని ఆర్.జి.ప్రభావతి పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో శనివారం పీ అండ్ టీ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎడారీకరణ, కరువును ఎదుర్కొనే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని ఏటా ఐక్య రాజ్య సమితి నిర్వహిస్తోందన్నారు. స్థిరమైన అభివృద్ధి చెందిన, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కరువు అత్యంత ప్రభావితం చూపిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మన భూగోళాన్ని సమస్త జీవరాశితో కళకళలాడేలా చూద్దామని ఆకాంక్షించారు. ప్రాణ వాయువును 21 శాతం నుంచి 23.5 శాతానికి పెంచుకుందామన్నారు. అనంతరం విద్యార్థులు ఎకో వైజాగ్ ప్లకారులు ప్రదర్శించారు. గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జె.వి.రత్నం, సేవా సమాజం ప్రతినిధి మౌనిక, టీచర్లు రాధాదేవి, ఎస్.గీత పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయనకు పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కళారి అనిల్‌కుమార్‌రాజు, ఉషశ్రీ, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.











సీఎం జగన్‌కే యువత మద్దతు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు



విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆళ్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే పరమావధి

కంచరపాలెం: ప్రజా శ్రేయస్సే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రాంజీ ఎస్టేట్ ప్రాంతాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ కె.కామేశ్వరి, వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, కృపా, సురేష్, జయ, కుమార్, అజయ్, షేక్ బాబ్జి, చిరంజీవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాన్టెక్ ఎక్స్‌పో -2023కి విశేష స్పందన



కుమార్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు కొనసాగాయి. కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

మురళీనగర్: మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వాకర్స్ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. క్లబ్ మూలనిధి రూ.11 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచాలని, జూలై 1న వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, నిమ్మగడ్డ బుచ్చయ్య 90వ జన్మదినోత్సవం, జూలై 4న అల్లూరి సీతారామరాజు వర్ధంతి తదితర కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్, పూర్వాధ్యక్షులు బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, చిలకపాటి కృష్ణమూర్తి, కుప్పిలి ద్వారకానాథ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ సలే అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్‌పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీబీఐ,ఎన్ఐఏలకు కిడ్నాప్ కేసు అప్పగించండి'

సీతమ్మధార: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులతోపాటు ఆడిటర్ జీవీ కిడ్నాప్ కేసును సీబీఐ, ఎన్ఐఏలకు అప్పగించాలని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు. గురుద్వారా దరి బీజేపీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసి రెండు రోజుల పాటు ఇంట్లోనే ఉంచి బెదిరించడం, ఆకు రౌడీ ఎంపీ ఇంటికి వెళ్లడమంటే సాధారణమైన విషయం కాదన్నారు. అసలు నిజాలు బయటకు రావాలంటే సీబీఐ, ఎన్ఐఏలకు ఈ కేసును అప్పగించాలన్నారు.

వాహన చోదకుడిపై ఫిర్యాదు

మద్రిపాలెం: ఒక ద్విచక్ర వాహనదారుడిపై ఆటోడ్రైవర్ ఫిర్యాదు చేశారని ఐదో పట్టణ పోలీసులు తెలిపారు. బైరెడ్డి నగేష్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో రెడ్డికంచరపాలెంలో నివసిస్తున్నాడు. గత నెల 5న రెడ్డికంచరపాలెం రోడ్డులోని ఆర్చ్ వద్ద ఆటో పార్క్ చేయగా.. మద్యం మత్తులో లోవరాజు అనే వ్యక్తి బైకుపై వచ్చి నగేష్‌ని ఢీకొట్టాడు. కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతడిని ప్రైవేట్ నర్సింగ్ హోంలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ 23వ తేదీన ఆపరేషన్ చేశారు. వైద్యం ఖర్చులు భరిస్తానన్న లోవరాజు పట్టించుకోవడం లేదని నగేష్ భార్య పావని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



గూడె రాజీవ్

మద్రిపాలెం: ఒక విద్యార్థి అదృశ్యమైన ఘటనపై ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దరి బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌కు చెందిన గూడె రాజీవ్ ఒక కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల అతడు కాలేజీకి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం దరఖాస్తు కోసం అంటూ బైకుపై కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. తన కోసం వెతకొద్దని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా రాజీవ్ మెసేజ్ పంపాడు, వారు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తండ్రి వెంకట అప్పారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి, యువజన విభాగం అధ్యక్షుడిగా సురేష్‌కుమార్



సీతమ్మధార: రాష్ట్ర కాపు(జేఏసీ) విద్యార్థి, యువజన విభాగం అధ్యక్షుడిగా సీతమ్మధారకు చెందిన మద్దింశెట్టి సురేష్‌కుమార్ ఎంపికయ్యారు. జేఏసీ కాపు రాష్ట్ర అధ్యక్షుడు అమ్మ శ్రీనివాసనాయుడు నియమించారు. రాష్ట్రంలో కాపు యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సురేష్‌కుమార్ అన్నారు.